సమయపాలన పాటించకపోతే చర్యలు



భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఈవో

రొంపిచర్ల: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. రొంపిచర్ల బీసీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మండల విద్యా వనరుల కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టిక, పనితీరు, విద్యార్థుల మధ్యాహ్న భోజనం పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంఈవో-2 డి.బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యాయిని ఆర్.వకుళాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త నాగమల్లేశ్వరి తదితరులున్నారు.

కేంద్ర బృందం పర్యటనకు సహకరించాలి : కలెక్టర్



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ పర్యటనకు అధికారులు సహకరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2024- 25 సంవత్సరానికి మొదటి దశ కమిటీ 23 వరకు పర్యటిస్తుందని పేర్కొన్నారు. ఎన్‌ఈఆర్‌జీఎస్, స్వామిత్వ, గృహ నిర్మాణం, సామాజిక సహాయం తదితర అంశాలపై కమిటీ పరిశీలన చేస్తుందన్నారు. కమిటీ జిల్లాలోని క్రోసూరు, కారంపూడి, మాచర్ల, మాచవరం మండలాల్లో పర్యటిస్తుందని పేర్కొన్నారు. ఆయా మండలాల్లో చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కమిటీ పర్యటనపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో భాగమైన శాఖల అధికారులు నివేదికలను సమగ్రంగా అందజేయాలని చెప్పారు. కమిటీ పర్యటనకు డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా తీరంలో ఇసుక మాయం

న్యూస్‌టుడే, అమరావతి, అచ్చంపేట (క్రోసూరు)



వైకుంఠపురం రీచ్‌లో తవ్వకాలతో ఏర్పడిన గోతులు

గత వైకాపా ప్రభుత్వంలో అధికారికంగానే ఇసుక దోపిడీ చేశారు. ఆ పార్టీ నాయకులు రూ.లక్షలు జేబులు నింపుకొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. పెదకూరపాడు నియోజకవర్గంలోని కృష్ణా తీరంలో ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. చీకటి పడగానే.. ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో నదిలోకి ప్రవేశిస్తున్నారు. గుట్టుగా ఇసుక తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో అధికారికంగా ఎక్కడా ఇసుక తవ్వకాలు జరపడం లేదు. దీంతో గిరాకీ పెరిగింది. దీన్ని అదనుగా చేసుకున్న ఇసుకాసురులు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. అచ్చంపేట, అమరావతి మండలాల్లోని కృష్ణా తీర గ్రామాల్లో అర్ధరాత్రి ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

రాత్రంతా రవాణా: ప్రభుత్వం ఇసుకాసురులపై కొరడా ఝులిపిస్తామని ప్రకటనలు చేస్తున్నా ఎక్కడా తగ్గడం లేదు. అమరావతి మండలం వైకుంఠపురం, మునగోడు, మల్లాది, దిడుగు, ధరణికోట, అచ్చంపేట మండలం కోనూరు, కస్తల, చింతపల్లి, చామర్రు గ్రామాల్లో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. రాత్రి 11 తర్వాత రీచ్‌ల్లోకి వెళుతున్నారు. రాత్రంతా రవాణా చేస్తున్నారు. తెల్లవారగానే తవ్వకాలను నిలిపివేస్తున్నారు. గుంటూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి ప్రాంతాలకు తరలించి ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేలు వరకు వసూలు చేస్తున్నారు. వారం రోజుల కిందట క్రోసూరు మండలంలో అధికారులు మెరుపు దాడులు చేసి, ఒకేసారి ఏడు ఇసుక వాహనాలను పట్టుకొని సీజ్ చేశారు. వైకుంఠపురం ఇసుక రీచ్ నుంచి వచ్చే వాహనాలు గ్రామం మధ్యలోనే వెళుతున్నాయి. ఇసుక వాహనాల శబ్దంతో రాత్రివేళ నిద్రపోలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు.



అచ్చంపేట మండలంలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

ప్రారంభంకాని రీచ్‌లు: గుంటూరు జిల్లాలో ఇటీవల టెండర్ల ప్రక్రియ ద్వారా ఇసుక రీచ్‌లను ప్రారంభించారు. పల్నాడు జిల్లాలో మాత్రం ప్రారంభించకపోవడంతో ఇసుక కొరత ఏర్పడుతోంది. టెండర్లు వేయడంలో తప్పులు దొర్లాయని, అందుకే ఆలస్యమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అమరావతి మండలం దిడుగు, పొందుగల, అచ్చంపేట మండలం అంబడిపూడి, కోనూరు ఇసుక రీచ్‌లలో తవ్వకాలకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. గుత్తేదారులు టెండర్లు దాఖలు చేశారు.

నకిలీలొస్తున్నాయ్ జాగ్రత్త!



కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఓ రైతు వరి పైరులో దోమల నియంత్రణకు ప్రముఖ కంపెనీ పేరు మీద ఉన్న పురుగుల మందు కొనుగోలు చేసి వాడారు. దోమల బెడద తగ్గకపోగా పంట దెబ్బతినడంతో వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. శాస్త్రవేత్తలు ఆ పైరును పరిశీలించి తేల్చిందేమంటే.. రైతు వాడింది నకిలీ పురుగు మందు.

ఈనాడు, నరసరావుపేట

మార్కెట్లో నకిలీ పురుగుమందులు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రత్యేకించి వరి రైతులు ఎక్కువగా వినియోగించే దోమల నివారణ మందులకు నకిలీవి సృష్టించి ప్రముఖ బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి తెస్తున్నారు. ఒక ప్రముఖ కంపెనీ దోమల మందు 94 మిల్లీ లీటర్ల సీసా ఖరీదు గరిష్ఠ చిల్లర ధరకన్నా తక్కువగా రూ.1,220కు విక్రయిస్తున్నారు. ఈ మందు బాగా పని చేస్తుందన్న నమ్మకంతో రైతులు విరివిగా వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా ఈ కంపెనీని పోలిన డబ్బాలు తయారు చేసి నకిలీ మందును మార్కెట్లోకి తీసుకొచ్చారు అక్రమార్కులు.

హైదరాబాద్ కేంద్రంగా తయారీ: హైదరాబాద్ నగర శివార్లలో బయో ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలున్నాయి. వీటి మాటున కొంతమంది నకిలీలు తయారు చేసి మార్కెట్లోకి వదులుతున్నారు. ఇందు కోసం ప్రముఖ కంపెనీలకు చెందిన, భారీగా డిమాండ్ ఉన్న పురుగుమందుల డబ్బాలను పోలినవి వినియోగిస్తున్నారు. డబ్బాల్లో తేడా లేకపోవడం, ఎప్పుడూ కొనుగోలు చేసే దుకాణాల్లోనే వాటిని విక్రయిస్తుండడంతో రైతులకు అనుమానం రావడం లేదు. పైగా వీటిని ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఎక్కువగా విక్రయిస్తున్నారు. వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల నిఘా తక్కువ ఉండడమే దీనికి కారణం. ఈ నకిలీ మందులు హైదరాబాద్ నుంచి రెగ్యులర్ పార్సిల్ సర్వీసుల్లో కాకుండా శివారు ప్రాంతాలకు వివిధ సామగ్రి చేరవేసే ట్రాన్స్‌పోర్టు కంపెనీల ద్వారా గుంటూరు చుట్టుపక్కల పట్టణాలకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు సరఫరా అవుతున్నాయి.

దళారులదే హవా

పురుగుమందుల వ్యాపారంలో దళారుల ప్రమేయం ఎక్కువగా ఉంటోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి పంటల సాగు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విత్తనాలు, పురుగుమందుల వ్యాపారులెక్కువగా ఉన్నారు. పోటీ కారణంగా మార్జిన్‌ను పట్టించుకోకుండా ఒక్కొక్కరు ఒక్కో ధరకు విక్రయిస్తుంటారు. గుంటూరు కేంద్రంగా ఉన్న దళారులు.. ప్రముఖ కంపెనీలు ఇక్కడి వ్యాపారులకిస్తున్న ధరలతో, వేరే రాష్ట్రంలోని ధరలతో పోల్చి తక్కువకు వస్తున్న ప్రాంతాల నుంచి సరఫరా అయ్యేలా చక్రం తిప్పుతున్నారు. దీంతో రిటైల్ ధరల కొచ్చేసరికి కొంత తేడా ఉంటోంది. ఈ క్రమంలో డిమాండ్ ఉన్న పురుగుమందులకు నకిలీలు వస్తున్నాయి. వీటిని రైతులు గుర్తించలేక మోసపోతున్నారు. గడువు మీరిన మందులను మళ్లీ రీప్యాక్ చేసి విక్రయిస్తున్న ఘటనలూ ఉన్నాయి. గడువు సమయం సమీపించేకొద్దీ ధరలు తగ్గించి విక్రయిస్తున్న వ్యాపారులున్నారు.

ఇలా అడ్డుకోవచ్చు

ప్రముఖ కంపెనీల పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు డబ్బాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే అది ఒరిజనలా? కాదా? స్పష్టమవుతుంది. రైతులు ఆయా కంపెనీల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ పరిజ్ఞానం తెలియకపోతే వ్యాపారిని కచ్చితంగా స్కాన్ చేసి చూపించాలని కోరి నిర్ధారించుకున్న తరువాతే కొనుగోలు చేయాలి. నకిలీ డబ్బాలపైనా క్యూఆర్ కోడ్ ఉంటోంది. రైతులు తనిఖీ చేయగలిగితే మోసపోకుండా బయటపడొచ్చు.

వయోజనుల అక్షరాస్యతకే ఉల్లాస్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని విజయవంతం చేయాలని డీఆర్వో వినాయకం పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సమాజంలో అందరికీ జీవిత కాల అభ్యసనం, అవగాహన అనే కార్యక్రమం కింద నూతన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమంతో పాటు జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే లక్ష్యమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీడీవో అధ్యక్షతన మండల శాఖలను రెండ్రోజుల్లోగా ఏర్పాటు చేయాలని సూచించారు. స్వచ్ఛందంగా బోధించే వారికి గుర్తించాలన్నారు. నిరక్షరాస్యులకు నవంబరు 2 నుంచి 2025 మార్చి 15 వరకు ప్రతి రోజు రెండు గంటల పాటు బోధన నిర్వహించాలని చెప్పారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్‌మోహన్‌రావు, నోడల్ అధికారి దేవరకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ తమిళనాడు


ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. 347 పాయింట్లు సాధించి తమిళనాడు రాష్ట్రం ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.

❖ అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలవగా..ఏపీ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. అండర్-16 బాలుర విభాగంలో తెలంగాణ, కర్ణాటక, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక, తమిళనాడు, అండర్-20 బాలుర విభాగంలో తమళనాడు, కర్ణాటక రాష్ట్రాలు నిలిచాయి. ❖ అండర్-14, అండర్ -16, అండర్ -18, అండర్ -20 బాలికల విభాగంలో తమిళనాడు, కర్ణాటకలే తొలి రెండు స్థానాలలో నిలిచాయి. ❖ వ్యక్తిగత విభాగంలో అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్, అండర్-16 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు ఆయుష్, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు దయానంద్, అండర్ -20 బాలుర విభాగంలో ఏపీ క్రీడాకారుడు షేక్ రోషన్ పతకాలు దక్కించుకున్నారు. ❖ అండర్-14 బాలికల విభాగంలో తమిళనాడు క్రీడాకారిణి ఆర్తి, అండర్-16 బాలికల విభాగంలో ఏపీ క్రీడాకారిణి డింపుల్ మహాశ్రీ, అండర్ -18 బాలిక విభాగంలో కర్ణాటక క్రీడాకారిణి శృతిశెట్టి, అండర్-20 బాలికల విభాగంలో తమిళ క్రీడాకారిణి శ్రీ వర్ధినికి పతకాలు వరించాయి. విజేతలకు భారత క్రీడా సమాఖ్య ఈసీ సభ్యురాలు హైమావతి, సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కిరణ్ బహుమతులు ప్రదానం చేశారు.

నగల వ్యాపారిని బెదిరించి రూ.39.50 లక్షల దోపిడీ

మేదరమెట్ల: బంగారం కొనుగోలుకు వెళ్తున్న వ్యాపారిని బెదిరించి రూ.39.50 లక్షల నగదు అపహరించారు. ఈ సంఘటన కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన పల్లం స్వరూప్‌కు నగల దుకాణం ఉంది. శుక్రవారం రాత్రి బంగారం కొనుగోలుకు తనకు తెలిసిన గూడ్స్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన కంటైనర్ లారీలో చెన్నైకు బయలుదేరారు. పి.గుడిపాడు సమీపంలోకి వచ్చేసరికి లారీకి కొందరు కారు అడ్డు పెట్టారు. లారీలో ఉన్న స్వరూప్‌ను బెదిరించి కారులో ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి గ్రోత్ సెంటర్ వరకు కారులో తీసుకెళ్లి అతని వద్ద ఉన్న నగదు బ్యాగ్‌ను తీసుకుని అదే కారులో పి.గుడిపాడు సమీపంలో వదిలివెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహమ్మద్ రఫీ వెల్లడించారు.

మృత్యు మార్గం



* ప్రమాదకర గుంతలున్నా పట్టించుకోక ఘటనలు
* వినుకొండ-అద్దంకి రోడ్డుపై ప్రయాణమంటే ప్రయాణికుల హడల్

వినుకొండ–అద్దంకి మార్గంలో ప్రయాణమంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. బస్సుల్లో ప్రయాణించే వారైతే గమ్యస్థానం చేరేవరకూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఇక ద్విచక్ర వాహనాలు, ఆటోల సంగతి చెప్పనక్కర్లేదు. కొద్ది దూరానికి కూడా గంట సమయం పడుతోంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఇక అంతేసంగతులు. రోడ్డు వేస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు కాలయాపన చేసింది. కూటమి ప్రభుత్వం అయినా త్వరగా రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలని సమీప గ్రామస్థులు వేడుకుంటున్నారు. తాజాగా బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన ఉపాధ్యాయిని ధనలక్ష్మి ఈ గుంతల రోడ్డులో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ కిందపడడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు.

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, వినుకొండ గ్రామీణ

వినుకొండ నుంచి అద్దంకికి వెళ్లే రోడ్డు వినుకొండ పరిధిలో 20 కిలోమీటర్లు మేర ఉంది. బాపట్ల జిల్లా సరిహద్దు నాగులవరం వరకూ అడుగుకో గుంత ఉంది. ఈ మార్గంలో 13 గ్రామాల జనం రాకపోకలు సాగిస్తుంటారు. ఆరేళ్లుగా ఈ రోడ్డు గుంతలతో పూర్తిగా ఛిద్రమైంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. గతేడాది ఒక స్వచ్ఛంద సంస్థకు చెందిన వ్యక్తి తన సొంత డబ్బుతో కొన్ని గుంతల్ని పూడ్చారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మళ్లీగుంతలు ఏర్పడ్డాయి. గత ఐదేళ్లలో ఈ రహదారిపై అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.



కోటప్పనగర్ వద్ద ధ్వంసమైన వినుకొండ - అద్దంకి రహదారి

2022 ఆగస్టులో ఇద్దరు మృత్యువాత : నిరుపేద కుటుంబం కావడంతో అందరూ కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటారు. మొదటి కాన్పులో అమ్మాయి పుడితే అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. రెండోసారి సదరు మహిళ గర్భిణి కావడంతో కుటుంబ సభ్యులు ఆనందపడ్డారు. అది ఎంతో కాలం నిలవలేదు. విధి ఆడిన వింత నాటకంలో రోడ్డు ప్రమాదం రూపంలో రెండుప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరొకరు గాయాలపాలయ్యారు. నేడు ఆ కుటుంబం కకావికలమైంది. ఈ విషాదగాథ పెదకంచర్ల గ్రామానికి చెందిన గుడిపాటి కోటేశ్వరరావు కుటుంబంలో చోటుచేసుకుంది. వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన గుడిపాటి కోటేశ్వరరావు తన భార్య అనూష(22) గర్భిణి కావడంతో వైద్య పరీక్షల నిమిత్తం 2022 ఆగస్టులో ద్విచక్ర వాహనంపై 11 నెలల కుమార్తె వైష్ణవితో కలిసి ముగ్గురు బయలుదేరారు. వినుకొండ-అద్దంకి రోడ్డులో గోనుగుంట్ల వారిపాలెం కాలనీ వద్దకు వచ్చేసరికి అద్దంకి నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. దీంతో ముగ్గురూ కిందపడగా అనూషపై నుంచి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కోటేశ్వరరావు, వైష్ణవిలకు తీవ్ర గాయాలయ్యాయి. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ వైష్ణవి(11 నెలలు) మృతి చెందింది. అప్పట్లో పెద్ద సంచలనం రేకెత్తించింది ఈ ఘటన.



నాగులవరం వద్ద అదుపు తప్పి రోడ్డు దాటి పొలాల్లోకి వెళ్లిన బస్సు

ఈ ఏడాది సెప్టెంబరు 9న: నాగులవరం వద్ద రోడ్డుపై గుంతలు ఉండడంతో గత సెప్టెంబరు 9న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. దారిన వెళ్లేవారు వచ్చి అందులోని 20 మంది విద్యార్థులను బయటకుతీసి రక్షించారు. ఇదే దారిలో గతేడాది రెండుసార్లు బస్సులకు కమానుకట్టలు విరిగాయి. ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇలా బస్సులు మధ్యలో ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతలు పడిన దారిలో అవస్థలు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

1,29,600 క్యూసెక్కుల నీటి విడుదల



విజయపురి సౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయం 16 క్రస్టు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 1,29,600 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదికి విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,597 క్యూసెక్కులు వదులుతున్నారు. కుడి కాలువకు 6112, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 1,74,120 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం సాగర్‌లో 312.0450 టీఎంసీల నీరు ఉంది.

పులిచింతలకు వరద

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో శనివారం వరద ప్రవాహం పెరిగింది. రాత్రి 7 గంటలకు 4 రేడియల్ గేట్లు ఎత్తి 1,03,162 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తికి 16,000 కలిపి 1,19,162 క్యూసెక్కులు దిగువకు ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నట్లు ఏఈఈ రాజు తెలిపారు. ఎగువ నాగార్జునసాగర్ పరివాహక ప్రాంతం నుంచి 1,34,933 క్యూసెక్కులు వచ్చి చేరిందన్నారు. ప్రాజెక్టులో 40.67 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఏపీ టెట్ పరీక్షకు 87.6 శాతం హాజరు

నరసరావుపేట అర్బన్: జిల్లాలో ఏపీ టెట్ పరీక్షలకు 87.6 శాతం అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, ఏఎం రెడ్డి స్మారక ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 600 మందికి 526 మంది హాజరయ్యారని వివరించారు.

బారులు తీరాయ్



కంపెనీల నుంచి లారీల కొద్దీ మద్యం నరసరావుపేటలోని డిపో వద్దకు చేరుకుంది. ఇందులోని నాలుగు గోదాముల్లో ఖాళీ లేక.. రోజులుగా మద్యం నిల్వలతో లారీలు రోడ్డుపై నిలిచి ఉన్నాయి. – నరసరావుపేట టౌన్

పట్టణాలకు నిధులొచ్చాయ్



ఇలాంటి కష్టాలు తీరనున్నాయి..

సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో పట్టణాభివృద్ధి పడకేసింది. సాధారణ పౌరసేవలతోపాటు మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సంఘం నిధుల్ని జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దీంతో పట్టణాల్లో పౌరసేవలు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థిక సంఘం నిధుల్ని మున్సిపల్ ఖాతాలకు జమ చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలివిడత నిధుల్ని పీఎఫ్ఎంఎస్ ఖాతాలకు జమ చేశారు. ఈ నిధుల సద్వినియోగంతో పట్టణాభివృద్ధికి స్థానిక సంస్థలు బాటలు వేయాల్సిన అవసరముంది.


ఏఏ పనులు చేపట్టాలంటే..: తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, మురుగు, వరద కాలువల నిర్వహణ, శాస్త్రీయంగా చెత్త, ఘనవ్యర్థాల సేకరణ, సంపద సృష్టిపై ప్రధానంగా మున్సిపాల్టీలు శ్రద్ధ చూపించాలి. శాశ్వత రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి సాధారణ నిధులకు తోడు ఆర్థిక సంఘం నిధులతో పనులు పూర్తి చేయాలి. ప్రతి ఇంటికి రక్షిత నీటిని అందించేలా చొరవ చూపించాలి.

పట్టణం	జమైన నిధులు
చిలకలూరిపేట	12,50,765
మాచర్ల	5,42,765
సత్తెనపల్లి	5,13,377
వినుకొండ	5,43,662
పిడుగురాళ్ల	5,87,361
దాచేపల్లి	4,27,287
గురజాల	3,11,584

☛ చిలకలూరిపేట, మాచర్ల, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల పట్టణాలకు రూ.58,381 చొప్పున అదనపు నిధులు మంజూరయ్యాయి. నరసరావుపేట పురపాలక సంఘానికి ఎన్నిక జరగకపోవడంతో కేటాయింపులు జరగలేదు.

పిడుగుపడి రైతు మృతి

రుద్రవరం(అచ్చంపేట), న్యూస్‌టుడే: పశువులు మేపేందుకు పొలం వెళ్లిన రైతు పిడుగుపాటుకు గురై మృతి చెందారు. రుద్రవరానికి చెందిన రైతు గడ్డం హనుమంతరావు(58) శనివారం పశువులను మేపేందుకు కోగంటివారిపాలెం వైపు పొలాలకు వెళ్లారు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఆ సమయంలో పిడుగు పడటంతో రైతు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బంధువులు ఆయన మృతదేహాన్ని ఇంటికి తరలించారు. రైతు భార్య సీతారావమ్మ రెండేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందింది. కుమారుడు యజ్ఞనారాయణ వద్ద ఉంటున్నారు.



హనుమంతరావు (పాతచిత్రం)

22 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు పురపాలక సంఘ పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి.శ్రీహరిబాబు శనివారం తెలిపారు. ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూలు, శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బీఆర్‌జీ పురపాలక సంఘోన్నత పాఠశాలలో ప్రత్యేక కేంద్రాలు 22 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అంతా నా ఇష్టం


అస్తవ్యస్తంగా అమరేశ్వరాలయ పాలన

అర్చకుల్లో విభేదాలు

స్వామి సేవలో తరించాల్సిన అర్చకులు గ్రూపులు కట్టారు. తరచూ ఆలయంలోనే ఘర్షణలకు పాల్పడుతున్నారు. వంతుల వారీగా విధులు నిర్వహించాల్సిన అర్చకులు విధి నిర్వహణలో సరిగ్గా ఉండటం లేదు. వారి వ్యవహార శైలిపై భక్తులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. నవగ్రహాలయానికి దాతలు ఇచ్చిన మాన్యాన్ని ఓ అర్చకుడు అమ్ముకున్నా ఇంతవరకు చర్యలు లేవు.

అమరావతి, న్యూస్‌టుడే

పంచారామాల్లో ప్రథమ ఆరామంగా వెలుగొందుతున్న అమరేశ్వరాలయ పాలన అస్తవ్యస్తంగా మారింది. రెండేళ్ల కిందట వచ్చిన ఓ అధికారి నియంతృత్వ పోకడల కారణంగా ఆలయ ప్రతిష్ఠ మసకబారుతోంది. గత ఐదేళ్లుగా ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగకపోగా.. తరచూ వివాదాలకు కేంద్రంగా మారింది. దేవాదాయశాఖ అధికారులు దృష్టి సారించక పోవడంతో సదరు అధికారి అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే సిబ్బంది, అర్చకులు ఆయన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ అధికారికి ఇతర జిల్లాకు బదిలీ చేసినా.. ఇన్‌ఛార్జిగా ఇక్కడే కొనసాగేలా కొందరు కూటమి నేతలు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



అమరేశ్వరాలయం

ఆది నుంచీ వివాదాస్పదమే

ఆ అధికారి తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. వైకాపా ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, ఆయన భార్యకు అనుకూలంగా వ్యవహరించి పనులు చక్కదిద్దుకున్నారు. వైకాపా అనుకూల సిబ్బందికి నిబంధనలకు వ్యతిరేకంగా పదోన్నతి కల్పించారు. కూటమి ప్రభుత్వం రాగానే అక్రమ పదోన్నతిపై వచ్చిన సిబ్బందిని తిరిగి పూర్వస్థానానికి పంపించారు. ఎన్నడూ లేనివిధంగా ఆలయంలో చోరీ జరిగింది. దానిపై ఇంతవరకు నిగ్గు తేల్చలేదు. అమరేశ్వరాలయ ప్రధాన గాలిగోపురాన్ని ఓ కారు ఢీకొనడంతో తలుపు దెబ్బతిన్నా చర్యలు లేవు. ఇటీవల వైకాపా మాజీ ఎమ్మెల్యే పీఏ ఆలయానికి రాగా ఆయనకు రాచ మర్యాదలు చేశారు. ఆలయంలోని వెంకటాద్రి నాయుడు మండపం చుట్టూ భక్తులకు గాలి వచ్చేలా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా గ్రిల్స్ మూసి వేసేలా గోడ కట్టారు. అక్కడ ఎటువంటి నిర్మాణం చేపట్టవద్దని స్థపతి చెప్పినా ఆ అధికారి లెక్క చేయలేదు. ఆలయ సిబ్బంది, అర్చకులతో తరచూ వివాదాలే.. ఏ ఒక్కరికీ డ్యూటీ ఆర్డర్ ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇటీవల లడ్డూల అమ్మకాల్లో గోల్‌మాల్ జరిగింది. ఆలయ భూముల కౌలు వసూళ్లు కూడా చేపట్టక పోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం ఆలయానికి ఒప్పంద పద్ధతిలో నలుగురు అటెండర్లను మాత్రమే తీసుకోవాలి. కానీ ఏడుగురిని నియమించారు.

వాగు వస్తే.. అవస్థే

తండావాసులకు కష్టాలు



విద్యార్థులను వాగు దాటిస్తున్న తండావాసులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి శనివారం మండలంలోని మిట్టమీద పల్లె వద్ద వాగు ఉద్ధృతంగా ప్రవహించింది. పిచ్చయ్యబావితండాకు రాకపోకలు నిలిచిపోయాయి. మిట్టమీదపల్లె గ్రామంలోని పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం తిరిగి తండాకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. తల్లిదండ్రులు వాగు వద్దకు చేరుకుని పిల్లలను క్షేమంగా ఇంటికి చేర్చారు. భారీ వర్షం వచ్చిన ప్రతిసారీ వాగు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు. మరోవైపు వెంకన్నకుంట నిండి వజ్రాలపాడు తండాలోని నీరు చేరింది.

బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ విభాగంలో అండర్-14, 17 బాలుర ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో బ్యాడ్మింటన్ విభాగంలో ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. 28, 29 తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ఈ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు అభినందించారు. జట్ల ఎంపిక పోటీలను పీడీలు చిరంజీవిరావు, షేక్.బాజి, పి.నరసింహారెడ్డి, రమాదేవి, హనిమిరెడ్డి, ఖాదర్‌మస్తాన్, స్వర్ణరాజు, శ్రీకాంత్, ఇస్మాయిల్ తదితరులు పర్యవేక్షించారు.

బీసీల సంక్షేమంపై కేంద్రం నిర్లక్ష్యం : కేసన

ఈపూరు, న్యూస్‌టుడే : బలహీన వర్గాల ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కేంద్రం పాలకులు ఆయా వర్గాల సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఈపూరులో శనివారం ఆయన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలు 60 శాతానికి పైగా ఉన్నా, ఆ మేరకు వారికి ప్రభుత్వ కేటాయింపులు చేయలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని, ఓబీసీల కులగణన చేయాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, నియోజకవర్గ అధ్యక్షుడు సిద్దయ్య, సంఘ నేతలు పాల్గొన్నారు.

రొంపిచర్ల : రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను పారదర్శకంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. రొంపిచర్లలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ ఎట్రాసిటీ చట్టంలా బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. స్థానిక నేతలు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను పాల్గొన్నారు.

24 నుంచి కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులతో సమావేశాలు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ విభాగాలతో ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఈ నెల 24 నుంచి సమావేశాలు నిర్వహించనున్నారని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో ఈ సమావేశాలు జరుగుతాయని చెప్పారు. అక్టోబరు 24న శ్రీకాకుళం, 25న మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, 26న కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, 27న కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, 28న ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు, నవంబరు 6న వై.ఎస్.ఆర్.కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు, 7న అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల నాయకులతో షర్మిల సమావేశమవుతారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

కేసానుపల్లిలో కొండచిలువ

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కొండ చిలువ కలకలం రేపింది. ప్రధాన వీధిలోని శివాలయం వద్ద కొండచిలువ కనిపించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. దీని పొడవు 10 అడుగులపైనే ఉందని వారు తెలిపారు. స్థానికుడు బాజి అటవీశాఖ అధికారి మనోజ్‌కు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడికి వచ్చేసరికి కొండ చిలువ పొదల్లోకి వెళ్లింది. దానిని పట్టుకోవడానికి నిఘా పెట్టినట్లు అధికారులు తెలిపారు.



శివాలయం వద్ద కొండచిలువ

ఏడు కిలోల గంజాయి పట్టివేత

నిందితులు వైకాపా నేత అనుచరులు

మల్లమ్మసెంటరు (నరసరావుపేట), న్యూస్‌టుడే : నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయించేందుకు తీసుకొచ్చిన ఏడు కిలోల గంజాయిని నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ విజయ్‌చరణ్ వివరాల మేరకు . .. నరసరావుపేట వరవకట్టకు చెందిన ఐదుగురు పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మేందుకు ఏడు కిలోలు తీసుకొచ్చారు. పక్కా సమాచారంతో పోలీసులు వారిని తనిఖీ చేయగా ఏడు కిలోల గంజాయి, 8 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరులుగా అనుమానిస్తున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల వసతి గృహం మైదానంలో శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్- 14 విభాగంలో బాల, బాలికల సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. వీరు 16 నుంచి 1 వరకు చిత్తూరు జిల్లా అరగొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గేమ్స్ సహాయ కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, రొంపిచర్ల జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుభాని, అయా పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

అండర్- 14 విభాగంలో బాలుర జట్టు వివరాలు:

పి.సుశాంక్ (పాలపాడు), ఎన్.భూపేందర్ (మాచర్ల), ఎ.వరప్రసాద్ (రొంపిచర్ల), టి.ఫెర్రీ (చిలకలూరిపేట), షేక్.బాబా (రావెల్ల), పి.వెస్లీ (పాలపాడు), వి.రాకేష్ (వినుకొండ), ఇశ్వంత్ (మాచర్ల), వి.మోహన్‌రెడ్డి (వినుకొండ), కె.కృష్ణ (దుర్గి), కె.రాము (వినుకొండ), నాగరాజు (ఎ.ముపాళ్ల), కె.భాను (పెదవడ్లమూడి), ఎస్.జస్వంత్ (తెనాలి), ఎస్.క్రాంతికుమార్ (కొండూరు), జి.సాయి (రొంపిచర్ల).

అండర్-14 బాలికల జట్టు వివరాలు : కె.చందన (పాలపాడు), కె.దేవర ఏంజెల్ (క్రోసూరు), ఆర్. భూమి (పాలపాడు), డి.ఇందు (నవలూరు), బి.ధనుజ (క్రోసూరు), వి.శ్రీదేవి (రొంపిచర్ల), డి.ప్రసన్న (కొండూరు) టి.అభినయ (చిలకలూరిపేట), బి.చందన (క్రోసూరు), ఎస్.మోహన్‌లక్ష్మి (సాతులూరు), ఎం.సాయిభవ్య (పాలపాడు), ఎం.విజయలక్ష్మి (మాచర్ల), దేవమణి (కొండూరు), సీహెచ్.బెస్లీ (ఎ.ముపాళ్ల), వై.యూకిత (తెనాలి), షేక్ శైలు (రొంపిచర్ల) ఎంపికనట్లు వెల్లడించారు.

వైద్యాధికారి ఆత్మహత్యాయత్నంపై విచారణ

ఈపూరు, న్యూస్‌టుడే : ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.కమలాకరరావు ఆత్మహత్యాయత్నంపై ఉన్నతాధికారులు శనివారం విచారణ చేపట్టారు. వైద్య విధాన పరిషత్ గుంటూరు జిల్లా సమన్వయకర్త డాక్టర్ మయాన మజీదా బేగం ఆసుపత్రి సందర్శించి విచారణ చేపట్టారు. కొంతమంది ఆసుపత్రి సిబ్బంది ఇబ్బందిపెడుతున్న కారణంగా తాను ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని వైద్యాధికారి చెబుతున్న నేపథ్యంలో ఆసుపత్రి సిబ్బందిని విడివిడిగా విచారించి వారి నుంచి లిఖిత పూర్వక వాంగ్మూలం తీసుకున్నారు. ప్రస్తుత వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరోగ్యశ్రీ డీఈవో అనంతకిషోర్‌ను విచారించారు. అతని పేరు హాజరు పట్టికలో, ఆసుపత్రి రికార్డుల్లో లేదని.. కానీ ఇక్కడ పని చేస్తున్నట్లుగా ప్రభుత్వం నుంచి వేతనం ఎలా తీసుకుంటున్నారని విచారణాధికారిణి ప్రశ్నించారు. అనంతరం సిబ్బందిని సమావేశపరిచి వారి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో వార్డులను సందర్శించగా 30 పడకల ఆసుపత్రిలో ఒక్క మంచంలో కూడా రోగులు లేరని, దీన్ని బట్టి సిబ్బంది పనితీరు ఉందో తెలుస్తోందని ఆమె తెలిపారు.



వైద్యసిబ్బందిని విచారిస్తున్న గుంటూరు డీసీహెచ్‌ఎస్ మజీదా బేగం

అమరావతి అభివృద్ధికి మళ్లీ అడుగులు

అమరావతి, న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైకాపా ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని, ప్రజలు ఆ పార్టీని భూస్థాపితం చేసి కూటమికి అధికారం కట్టబెట్టారని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి శనివారం ధరణికోటలో జరిగిన పెదకూరపాడు తెదేపా విస్తృతస్థాయి సమావేశం, పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ అమరావతి అభివృద్ధికి బీజం పడిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా పార్టీ నేతలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదులో అందరూ భాగస్వాములై 10 వేల ఓట్లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 20 వేల మంది యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తెదేపా నేతలు వెన్నాసాంబశివారెడ్డి, రాజన్‌బాబు, విష్ణు, వసంతరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జనసేన బాధ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆలపాటి రాజేంద్రప్రసాద్

జిల్లాను వీడని వర్షం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో శనివారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో భారీ వర్షం పడగా పలు చోట్ల ఎండ కాసింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజులు విస్తారంగా వర్షాలు కురిశాయి. తుపాను తీరం దాటడంతో వర్ష ప్రభావం ఉండదు అనుకుంటున్న తరుణంలో పలు మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వారం నుంచి వాతావరణం మేఘావృతమై ఏదో ఒక సమయంలో వర్షం పడటంతో ప్రస్తుతం సాగులో ఉన్న పలు వాణిజ్య పంటలు దెబ్బతింటాయని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

★ జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 161.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. మాచర్ల 6.2 మి.మీ., వెల్దుర్తి 3.0, దుర్గి 9.2, రెంటచింతల 5.2, గురజాల 10.0, దాచేపల్లి 17.4, కారంపూడి 4.2, పిడుగురాళ్ల 12.2, మాచవరం 8.8, బెల్లంకొండ 2.6, వినుకొండ 14.2, నూజండ్ల 3.8, శావల్యాపురం 4.0, ఈపూరు 2.2, రొంపిచర్ల 5.0, నరసరావుపేట 1.4, ముప్పాళ్ల 16.4, నాదెండ్ల 3.2, చిలకలూరిపేట 17.4, యడ్లపాడు 6.8 మి.మీ. వర్షం పడింది. పలు మండలాల్లో వర్షం పడలేదు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 145, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సాతులూరు విద్యార్థులు

సాతులూరు (నాదెండ్ల): మండలంలోని సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు తెలిపారు. చిత్తూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టులో 7వ తరగతి విద్యార్థి వనపర్తి జస్వంత్ బాలుర విభాగం అండర్- 14, 8వ తరగతి విద్యార్థిని సిద్ధాబత్తుని మోహనలక్ష్మి బాలికల విభాగం అండర్- 14కు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వీరిని పీడీ అంజమ్మ, సహాయ హెచ్ఎం ప్రసాదు, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు జస్వంత్ తేజ, మోహనలక్ష్మి

? వినుకొండ నూజండ్ల రోడ్డులో చాట్రగడ్డపాడు సమీపంలోని పెట్రోల్ పంపు ముందు పెద్ద గోతులు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. **- వెంకట్రావు, నూజండ్ల**

✔ మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. అన్ని గుంతలు పూడ్చుతాం. **- నవ్య, ఏఈ, ఆర్అండ్‌బి, వినుకొండ.**- వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

ఉచిత నేత్ర వైద్య శిబిరం నేడు

నరసరావుపేట అర్బన్: డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 20న ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శంకర కంటి వైద్యశాల సహకారంతో ఇది నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజాగారికోటలోని కోడెల శివప్రసాదరావు వైద్యశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు పరీక్షలు చేస్తారని చెప్పారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని దీక్షలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : అకారణంగా విధుల నుంచి తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు డిమాండ్ చేశారు. ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరాయి. వీటికి సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ సంఘీభావం తెలిపి ప్రారంభించారు. విధుల నుంచి తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకుంటే రానున్న రోజుల్లో అన్ని సంఘాలతో కలిసి ఉద్యమం తీవ్రం చేస్తామన్నారు. దీక్షలో అల్లాభక్షు, మాబు సుభాని, రమాదేవి, బాషా, పద్మ పాల్గొన్నారు.

చివరి మజిలీలో చిక్కులే

మరుభూముల్లో మౌలిక వసతులు కరవు ☛ అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు

యడ్లపాడు, చిలకలూరిపేట పట్టణం, చిలకలూరిపేట గ్రామీణ, గణపవరం, న్యూస్‌టుడే

చిలకలూరిపేట నియోజకవర్గంలో శ్మశానవాటికల్లో సరైన వసతులు లేక అంత్యక్రియలకు మృతుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో మరు భూముల అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. శ్మశానవాటికృఉ బాగు చేస్తానమని చెప్పిన వైకాపా నేతలు హామీలు నెరవేర్చలేదు. తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-2019 మధ్య కొన్ని గ్రామాల్లో వీటి అభివృద్ధికి నిధులు కేటాయించినా అరకొర ప్రహరీలతో సరిపెట్టారు. దీంతో వసతులు లేక అంత్యక్రియలకు అవస్థలు పడుతున్నారు.

☛ తెదేపా ప్రభుత్వ హయాంలో యడ్లపాడులో ఎర్రకొండ పక్కన హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఒకే స్థలంలో ఓసీ, బీసీలకు కేటాయించిన శ్మశానవాటికల చుట్టూ ప్రహరీ నిర్మించారు. నిధులు లేమితో అంత్యక్రియల నిర్వహణకు పూర్తిస్థాయిలో వసతులు సమకూర్చలేదు. ఊరికి దూరంగా ఉండటంతో మృతదేహాలను వాహనాల్లో తరలించాల్సి వస్తోంది. వర్షాకాలంలో దహన సంస్కారాలకు ఆటంకం కలుగుతోంది. ప్రత్యేక గది లేక వర్షం వస్తే తడిసిపోతున్నారు. ☛ మైదవోలులో బీసీ, ఓసీలు అందుబాటులో ఉన్న శ్మశానవాటిక వసతులు లేక గ్రామస్థులు అంత్యక్రియల నిర్వహణ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. కారుచోలలో ఓసీ, బీసీ శ్మశానవాటికలకు వసతులు లేవు. సందెపూడి హిందూ శ్మశానవాటిక ఎస్సీ కాలనీ పక్కనే ఉంది. అంత్యక్రియల సమయంలో పొగ కాలనీ వైపు వస్తోందని అభ్యంతరాలతో అక్కడ అభివృద్ధి చేయలేదు. కాలనీకి దూరంగా మరో స్థలం ఎంపిక చేసి కొత్తది నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ☛ అభివృద్ధికి చిరునామాగా నిలిచే తిమ్మాపురంలో శ్మశానవాటిక నిర్మాణంపై పాలకులు శీతకన్ను వేశారు. సొలసలో నక్కవాగు పక్కనే లోతట్టు ప్రాంతంలో మహాప్రస్థానం నిర్మించారు. గడేడి వాగుకు వరద రాగా ప్రహరీ కింద మట్టి కొట్టుకుపోయి గండి పడింది.

☛ చెంఘీజ్‌ఖాన్‌పేటలో శ్మశానవాటిక ప్రహరీ అసంపూర్తి నిర్మించటంతో ఆక్రమణకు గురవుతోంది. కోట గ్రామంలోని రెండింటిలో కంపచెట్లు మొలిచి లోపలకు వెళ్లలేని పరిస్థితి. కొండవీడు, కొత్తపాలెం, దింతెనపాడులో సౌకర్యాలు లేని వాటితో ఇబ్బంది పడుతున్నారు. మహా ప్రస్థానాల్లో సౌకర్యాలు కల్పించి అవస్థలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



యడ్లపాడులో అధ్వానంగా...



గణపవరం అంబేడ్కర్ కాలనీ నుంచి చెరువు రోడ్డుకు వెళ్లే దారిలో ప్రహరీ లేని శ్మశానం



గణపవరం చౌటిపాలెం శ్మశానవాటికలో ముళ్లకంప

చిలకలూరిపేట పట్టణం: గణపవరం ప్రాంతంలో శ్మశానవాటికలు ఆక్రమణలకు నిలయాలుగా మారుతున్నాయి. గణపవరం అంబేడ్కర్ కాలనీ నుంచి చెరువు పక్క వెళ్లే దారిలో ఉన్న శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ లేదు. ముళ్లచెట్లు ఉన్నాయి. గణపవరం నుంచి వేలూరు వెళ్లే రోడ్డులోని చౌటిపాలెం శ్మశానవాటిక రోడ్డు కంటే బాగా గుంతలో ఉంది. దీంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలబడుతున్నాయి. ఎస్ఎంజీ పక్కన, శారదా స్కూలు పక్కన శ్మశానవాటిక, వెంగళరెడ్డినగర్ ఓగేరువాగు పక్కన, బొంధిపాలెంలో వంతెన పక్కన వాగులో, రాగన్నపాలెంలోని శ్మశాన వాటికలు పిచ్చిచెట్లతో ఆక్రమణలకు గురవుతూ మారాయి.

☛ చిలకలూరిపేట మండలంలో మిట్టపాలెం ఎస్సీ కాలనీ, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెంలో శ్మశానాల్లో సమస్యలు ఉన్నాయి. తెదేపా ప్రభుత్వంలో 90 శాతానికి పైగా శ్మశానవాటికలను అభివృద్ధి చేసి ప్రహరీలు నిర్మించారు. వైకాపా ప్రభుత్వంలో కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు.

సృజనాత్మకతకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో నరసరావుపేట ప్రకాశ్‌నగర్ సీబీజీటీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో రాణించిన కె.పల్లవి (పదో తరగతి) ప్రథమ, ఎస్కే ఆఫ్రిన్ (తొమ్మిదో తరగతి) ద్వితీయ, డి.నిస్సీ (8వతరగతి) తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ యోగిరెడ్డి, ప్రిన్సిపల్ కామేశ్వరి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



విజేతలతో పాఠశాల నిర్వాహకులు

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

చిలకలూరిపేట గ్రామీణ : 'ఈనాడు' ఆధ్వర్యంలో చిలకలూరిపేట గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన యర్రం వర్షిత, షేక్ నేహా ముస్కాన్, ఆరుమల్ల పూర్ణిమకు గ్రీన్‌వ్యాలీ స్కూలు డైరెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ప్రిన్సిపల్ హేమ బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో గ్రీన్‌వ్యాలీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, ప్రిన్సిపల్ హేమ

మురుగు పారుదల పట్టించుకోరా?



కాలువలో పేరుకున్న పూడిక

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : పట్టణంలోని అరండల్‌పేటలో పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో పూడిక తీయడం లేదు. దీంతో కాలువలో మురుగు పేరుకుని దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో ఎరువులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకురాలు పి.మస్తానమ్మ అన్నారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం ఏడీఏ, ఏవో వి.నరేంద్రబాబు తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్ కాపీలను, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు.

వసతి గృహంలో మద్యం సీసాలా?

అపరిశుభ్రతపై జిల్లా న్యాయాధికారి ఆగ్రహం

నరసరావుపేట లీగల్, న్యూస్‌టుడే : పట్టణంలోని రామిరెడ్డిపేటలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో అపరిశుభ్రతపై 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎన్.సత్యశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె బాలుర వసతి గృహం-3 ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో మద్యం ఖాళీ సీసాలు, గుట్కా ప్యాకెట్లు వంటి వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉండటం గమనించి వసతి గృహ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అనంతరం లింగంగుంట్లలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం, పెద్ద చెరువు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం-1, 2లను తనిఖీ చేశారు.

వ్యవసాయ భూముల రీసర్వేలో సరిహద్దు సమస్యలు పరిష్కారం

చందవరం (నాదెండ్ల), న్యూస్‌టుడే : వ్యవసాయ భూముల రీసర్వేలో తలెత్తిన సరిహద్దు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. నాదెండ్ల మండలం చందవరంలో రెవెన్యూ గ్రామసభ శనివారం నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఉప తహసీల్దారు ధనలక్ష్మి, వీఆర్వో శ్రీధర్ బాబు, రైతులు పాల్గొన్నారు.

పల్లె పండగతో గ్రామ స్వరాజ్యం



అభివృద్ధి పనుల శిలఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు , పార్టీనేతలు

నూజండ్ల, న్యూస్‌టుడే: పల్లె పండగతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శనివారం అల్లిభాయిపాలెం, కొత్తపమిడిపాడు, నాగిరెడ్డిపల్లెలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సీసీ రోడ్డు, కాల్వలు, గోకుల షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎంపీడీవో ఉమాదేవి, ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు, నేతలు జడ్డా రామయ్య, చౌదరి సిబ్బంది తదితరులున్నారు.

శావల్యాపురం : పల్లె పండగ వల్ల గ్రామాల్లో దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. మండలంలోని శావల్యాపురం, కిష్టాపురంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. శావల్యాపురంలో రోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. కిష్టాపురంలో కాలువలు, మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి చేసిన భూమిపూజలో తెదేపా నాయకుడు గడుపూడి విశ్వనాథం తదితరులు ఉన్నారు. సర్పంచి ఏకసిరి చెన్నమ్మ, తెదేపా నేతలు నల్లమాటి వెంకటేష్, కర్రె పెద అంజయ్య, దూదేకుల ప్రభు హుస్సేన్, ఏపీవో కె.రామారావు, ఏఈ వెంకటేశ్వరస్వామి, పంచాయతీ కార్యదర్శి జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు : మండలంలోని జగ్గాపురం, జాలాది, తుర్లపాడు, సందెపూడిలో శనివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. మూడు సీసీ రోడ్లు, గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. సీసీ రోడ్లకు రూ.29 లక్షలు, గోకులం షెడ్డుకు రూ.2.30 లక్షలు ఉపాధి నిధులు కేటాయించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు కందిమళ్ల రఘు రామారావు, ముద్దన నాగేశ్వరరావు, పోపూరి శ్రీనివాసరావు, మద్దినేటి రామకృష్ణ, ఎంపీడీవో హేమలతాదేవి, ఏపీఎం రామారావు, టీఏ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లెల అభివృద్ధికి బాటలు వేస్తూ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, మునమాక, ముత్తనపల్లి, ఇంద్రగిరి, రైతునగర్‌లో శనివారం సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు పార్టీ నేతలు, అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ బి.నిర్మల, తెదేపా మండల అధ్యక్షుడు జగ్గయ్య, గాడిపర్తి సురేష్ పాల్గొన్నారు.

వినుకొండ రూరల్ : ఐదేళ్ల పాటు వైకాపా నేతలు రోడ్లకు తట్ట మట్టి కూడా పోయలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లు వేస్తున్నామని మాజీ ఎంపీపీ యాదగిరి రామయ్య, దొండపాడు మాజీ సర్పంచి రాంబ్రహ్మం అన్నారు. పల్లె పండగలో భాగంగా శనివారం భారతాపురం, దొండపాడు, తిమ్మాయిపాలెం, నరగాయపాలెం, పెదకంచర్ల, గోనుగుంట్లవారిపాలెంలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈవోపీఆర్డీ సుందరరెడ్డి, ఏఈ శ్రీనివాసరావు, ఏపీవో నాగేశ్వరరావు, అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట గ్రామీణ, నాదెండ్ల : సంక్షేమం, అభివృద్ధి మేళవింపుగా ప్రజాపాలన అందిస్తామన్న కూటమి నినాదానికి నిదర్శనమే రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునః ప్రారంభమని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కమ్మవారిపాలెం, నాదెండ్ల మండలం కనపర్రులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎంపీపీ దేవినేని శంకరరావు, సర్పంచి చాపల మడుగు జానకి, ఎంపీటీసీ సభ్యులు ఏసుపాదం, తెదేపా నేత బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఈపూరు : మండలంలోని ముప్పాళ్లలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మాజీ సర్పంచి మోదుగుల నరసింహారావు, నేతలు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో విద్యార్థులకు ఉద్యోగాలు



జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించినవారితో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శనివారం మెగా ఉద్యోగమేళా నిర్వహించారు. 2427 మంది పేర్లు నమోదు చేసుకోగా వారిలో నేరుగా 472 మంది ఉద్యోగాలు అవకాశాలు లభించాయి. 390 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. 36 సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి కలలుగంటున్న పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌ను సాధించుకోవడంలో మహిళలే తొలిమెట్టు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట ఎన్నార్టీ కూడలిలో ఏర్పాటుచేసిన మెప్మా బజారును శనివారం ప్రారంభించి, స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాల్స్ ఏర్పాటుకు బ్యాంకురుణాలు అందజేస్తామని తెలిపారు.

మూడు గంటలు పనులు నిలిపిన మున్సిపల్ కార్మికులు



కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య అధికారులు, పారిశుద్ధ్య కార్మికుల మధ్య వివాదం తలెత్తగా శనివారం మూడు గంటల పాటు పారిశుద్ధ్య కార్మికులు పనుల్లోకి వెళ్లకుండా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. శుక్రవారం నాలుగో డివిజన్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల రిజిస్టర్‌ను అధికారులు పరిశీలించారు. అయితే అందులో పేరున్న వారు కాకుండా వారి బంధువులు పనులు చేస్తుండటంతో అభ్యంతరం తెలిపారు. ఈ విషయంలో కార్మికులకు, అధికారుల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో కార్మికులు శనివారం ఉదయం 5 నుంచి 8 వరకు విధుల్లోకి వెళ్లకుండా మున్సిపల్ కార్యాలయం ఎదుట అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ జస్వంతరావు, ఎమ్మెల్యే అరవిందబాబు వెళ్లి మస్టర్‌లో ఎవరి పేరు ఉంటే వారే పని చేయాలని, పేరు లేనివారు పనిచేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని, అనారోగ్యంగా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి వారి అనుమతితో వేరేవారితో పనులు చేయించాలని చెప్పారు. ఇష్టానుసారంగా వ్యవహరించడం పద్ధతి కాదని చెప్పగా కార్మికులు తిరిగి పనుల్లోకి వెళ్లారు.

హ్యాండ్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక



ఎంపికైన బాల, బాలికల జట్లతో వ్యాయామోపాధ్యాయులు

చిలకలూరిపేట పట్టణం : స్థానిక ఏఎంజీ పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ అండర్- 19 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక శనివారం నిర్వహించారు. పోటీలను ఏఎంజీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ మహంతి ప్రారంభించారు. ప్రతిభ చూపిన వారిలో బాలురు విజయనగరం, బాలికలకు కడప జిల్లాలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనన్నారు. కార్యక్రమంలో అండర్ -19 ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకర్‌రావు, సెలక్షన్ కమిటీ ఇన్‌ఛార్జి వేళాంగిణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

21న ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నరసరావుపేట క్రీడలు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్- 14 బాలుర, బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 21న నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఆసక్తి గలవారు 9505143567 నంబరులో సంప్రదించాలని ఆయన చెప్పారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పట్టణ శివారులోని ఓ ప్రైవేటు కళాశాల ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై శనివారం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామీణ పోలీసుల కథనం మేరకు.. మాచర్లకు చెందిన బండారు దుర్గారావు, పట్టణ శివారు పాలపాడు రోడ్డులో ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. చదువుకోవటం ఇష్టం లేదని, వేరే పని నేర్చుకుంటానని కుటుంబ సభ్యులతో అంటుండేవాడు. ఈ క్రమంలో 16న కళాశాలకు వచ్చి 17న మధ్యాహ్నం నుంచి కనిపించలేదు. దీంతో కళాశాల యాజమాన్యం విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు తెలిసిన ప్రాంతాల్లో విచారించగా ఆచూకీ లభించలేదు. విద్యార్థి తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థి ఆచూకీ కోసం తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు.

రోడ్ల పక్కన అరటి బోదెలు పడేయవద్దు

వినుకొండ: డంపింగ్ యార్డు నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కాపురం రోడ్డులోని యార్డును శనివారం ఆయన సందర్శించారు. వాహనాల్లో తెచ్చిన చెత్తను వెళ్లే దారిలో కాకుండా లోపల వదిలేలా చూసుకోవాలని, తర్వాత జేసీబీతో దాన్ని గుట్టలుగా పోగు చేయాలని సిబ్బందికి సూచించారు. అరటి బోదెలను వ్యాపారులు పట్టణ శివారులో రోడ్డుకు ఇరువైపులా పారేయకుండా కారంపూడి రోడ్డులోని సమీకృత వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో ఎరువు తయారు చేసేందుకు అందించాలని చెప్పారు.

త్వరలో పూర్తిస్థాయిలో నగదు రికవరీ

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : మున్సిపల్ నిధులు దుర్వినియోగం చేసిన వారి నుంచి త్వరలో పూర్తిగా నగదు రికవరీ చేస్తామని పురపాలక సంఘ కమిషనర్ శ్రీహరిబాబు చెప్పారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఛాంబర్‌లో మాట్లాడుతూ మున్సిపాలిటీలో షరాబ్‌గా పనిచేసిన ప్రవీణ్ రూ.13,87,185 నగదును మున్సిపాలిటీకి జమ చేయకుండా అవినీతికి పాల్పడ్డారన్నారు. ఇతన్ని సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు పెట్టినట్లు చెప్పారు. అలాగే పొరుగు సేవల ఉద్యోగిని గంగా భవాని మున్సిపల్ దుకాణాల ద్వారా వచ్చిన అద్దె రూ.34.68 లక్షలు మున్సిపాలిటీకి జమ చేయలేదన్నారు. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించి.. రూ.12.94 లక్షల వరకు వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

సత్తెనపల్లి

•సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

శ్మశానవాటికకు రోడ్డు, వంతెన నిర్మించండి

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: 'గత తెదేపా ప్రభుత్వంలో ఆక్రమణల పాలవకుండా రూ.లక్షలు వెచ్చించి శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించారు. ప్రధాన రహదారి నుంచి శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన మార్గం లేదు.. దారిలో వంతెన నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించండి' అంటూ కంకణాలపల్లి పంచాయతీ వావిలాలనగర్ వాసులు వేడుకున్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి మండలంలోని ఏడు గ్రామాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శనివారం సుడిగాలి పర్యటన చేశారు. భృగుబండ, గోగులపాడులో అంతర్గత సిమెంటు రోడ్డు, కందులవారిపాలెం, రెంటపాళ్ల, పాకాలపాడుల్లో మురుగు కాలువలు, కంకణాలపల్లి, వావిలాలనగర్‌లో పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. వెన్నాదేవిలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని పునఃప్రారంభించారు.

వర్షంతో పంటలకు నష్టం


మిరప పంటలో నిలిచిన నీరు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఇటీవల కురుస్తున్న వర్షాలకు బొప్పాయి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే పత్తి పంటలో నీరు నిలిచి కుళ్లిపోతోంది. పత్తి నలుపు రంగులోకి మారింది. రూ.వేలు ఖర్చు చేసిన సాగుచేసిన మిరప పంట దెబ్బతిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? గురజాల వెంకటరావు కాలనీ 1, 5, 6 లైన్లలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం.
- కాలనీవాసులు

✔ దీపాలను ఏర్పాటు చేస్తాం. - **శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ**

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

దాచేపల్లి, న్యూస్‌టుడే: రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. ముత్యాలంపాడులో భూ రీసర్వేపై శనివారం గ్రామసభ ఏర్పాటు చేశారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. 35 మంది అర్జీలు అందినట్లు తహసీల్దార్ కుటుంబరావు తెలిపారు.

దుర్గి, న్యూస్‌టుడే: మండలంలోని శ్యామరాజుపురంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో రైతుల నుంచి 16 అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఫణీంద్రకుమార్ తెలిపారు.

మాచవరం: మండలంలో రీసర్వే పూర్తయిన శ్రీరుక్మిణీపురంలో శనివారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. రైతులు తమ సమస్యలపై 18 అర్జీలు అందజేశారు. తహసీల్దారు క్షమారాణి పాల్గొన్నారు.

ముప్పాళ్ల: రీసర్వేలో లోపాలు సరిదిద్దేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. పలుదేవర్లపాడులో శనివారం రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.


అడిగేవారు లేరని.. ఆక్రమించేస్తున్నారు...!

కాలువలు, రోడ్లపైనే దుకాణాలు ★ తోపుడు బండ్లు, ద్విచక్ర వాహనాల నిలిపివేత

సత్తెనపల్లి, న్యూస్‌టుడే:

కొందరి కబ్జాకు అనర్హం అన్నట్లుగా పట్టణాలు, నగర పంచాయతీల్లోని ప్రధాన రహదారుల పక్కన, మురుగు కాల్వలపై రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కొందరు ఏకంగా దుకాణాలు నిర్వహిస్తుండగా.. మరికొందరు వాటిని అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన రహదారుల విస్తరణతో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని ప్రజలు భావిస్తుంటే.. దీనికి భిన్నంగా ఆక్రమణలు పెరిగి సమస్య పునరావృతం అవుతోంది. అడిగేవారు లేకపోవడంతో పురపాలక సంఘాల పరిధిలోని మురుగు కాలువలు, రోడ్లపై పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు ఏర్పాటవుతున్నాయి. మరోవైపు ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇష్టారాజ్యంగా నిలిపేస్తున్నారు. తోపుడు బండ్లు దారిపైనే ఉంచి వ్యాపారాలు సాగిస్తూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు.

● సత్తెనపల్లిలో ప్రధాన రహదారి వెంట రఘురామ్‌నగర్‌లోకి వెళ్లే రోడ్డు ముందు మదర్‌థెరిసా విగ్రహం పక్కనే మురుగు కాలువపై రేకుల షెడ్డు నిర్మాణాన్ని ప్రైవేట్ వ్యక్తి చేపట్టారు. అతడిని చూసి కాలువ స్థలంలో మరో అక్రమ నిర్మాణాన్ని చేపట్టేందుకు మరొకరు సిద్ధమయ్యారు. ఇప్పటికే తాత్కాలిక దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే రోడ్డుకు అటువైపునకు జడ్పీ ప్రాంగణం ముందు మురుగు కాలువ, రోడ్డుపై అనధికార దుకాణాలు నడుస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, తాలుకా సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, ఎస్‌బీఐ రోడ్డు, ఆర్‌అండ్‌బీ బంగళా, వడ్డవల్లి, నరసరావుపేట రోడ్డులోనూ ఇలాంటి నిర్మాణాలు వెలిశాయి. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ షమ్మి హెచ్చరించారు.


గుంటూరు రోడ్డులో కాలువపై రేకుల షెడ్డు

పిడుగురాళ్లలోనూ అంతే..


జానపాడు రోడ్డుపైకి వచ్చిన బోర్డులు

